తుఫాన్ పంట నష్టంపై తేలిన లెక్క

649.84 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

- ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్
- రైతు సేవా కేంద్రాల్లో జాబితాలు

అనకాపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వారం సంభవించిన 'మొంథా' తుఫాన్ కారణంగా జిల్లాలో వివిధ పంటలకు వాటిల్లిన నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు సర్వే పూర్తిచేశారు. మొత్తం 3,553 మంది రైతులకు సంబంధించి 649.84 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి ఎం. ఆశాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఆధారంగా పంట నష్టం నమోదు వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరిచినట్టు చెప్పారు. ఈ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం అందుబాటులో వుంచినట్టు పేర్కొన్నారు. రైతులు ఎవరైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు చేస్తే వాటిని కూడా పరిగణనలోకి తీసుకొని తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆమె చెప్పారు.



తుఫాన్ కారణంగా మాడుగుల మండలం రామచంద్రపురంలో నేలకొరిగిన వరి పంట (ఫైల్ ఫొటో)

అతిథి అధ్యాపకుడి వికృత చేష్టలు

తనను ప్రేమించాలంటూ ఓ విద్యార్థినికి వాట్సాప్ మెసేజ్‌లు

- విద్యార్థి సంఘాల నేతల దృష్టికి తీసుకెళ్లిన బాధిత విద్యార్థిని
- ఆందోళనకు దిగిన విద్యార్థులు.. విచారణ కమిటీ వేసిన ప్రిన్సిపాల్
- గెస్ట్ లెక్చరర్ తీరుపై పలువురు ఫిర్యాదు
- రాజీనామా చేయించిన ప్రిన్సిపాల్

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): **స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుడు ఓ విద్యార్థినికి అభ్యంతరకరమైన మెసేజ్‌లు పంపుతూ వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆమె విద్యార్థి సంఘాల నేతలకు చెప్పడంతో కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ వ్యహారంపై స్పందించిన ప్రిన్సిపాల్... విచారణ జరిపించి సదరు అతిథి అధ్యాపకునితో రాజీనామా చేయించారు. ఇందుకు సంబంధించి విద్యార్థి సంఘాల నేతలు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.**

నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అతిథి అధ్యాపకుడిగా పని చేస్తున్న నారాయణరావు.. ఆర్ట్స్ గ్రూపు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని ట్రాప్ చేయడానికి వాట్సాప్‌లో మేసేజ్ పెట్టాడు. తన మాజీ ప్రియురాలిలా ఉన్నావని, తనను ప్రేమించాలంటూ మేసేజ్‌లో పేర్కొన్నాడు. విద్యార్థిని ఈ విషయాన్ని విద్యార్థి సంఘాల నేతల దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో గురువారం మధ్యాహ్నం విద్యార్థులు కళాశాలలో ఆందోళనకు దిగారు. అతిథి అధ్యాపకుడుని విధుల నుంచి తప్పించాలని, లేక పోతే తాము కళాశాల మానేస్తామని విద్యార్థినులు స్పష్టం చేశారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు స్పందించి, నిజనిర్ధారణ కోసం ఐదుగురు అధ్యాపకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పలువురు విద్యార్థినులను విచారించగా.. సదరు అతిథి అధ్యాపకుడి వ్యవహారశైలి సరిగా లేదంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రిన్సిపాల్‌ను కలిసి, నివేదికను ఆయన ముందుంచారు. దీంతో ప్రిన్సిపాల్ స్పందించి గెస్ట్ లెక్చరర్ నారాయణరావుతో రాజీనామా చేయించారు. విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఇసుకాసురులు రెడీ!

శారదా నదిలో తవ్వకాలకు సన్నద్ధం

- వరద తగ్గుముఖం పట్టడంతో బయటపడుతున్న ఇసుక మేటలు
- గవరవరం వద్ద తవ్వకాల కోసం వేలం పాట
- ఒక్కటైన అధికార, విపక్ష పార్టీల నాయకులు
- ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలతో నది గట్లకు ముప్పు



గవరవరం సమీపంలో శారదా నదిలో కొత్తగా ఏర్పడిన ఇసుక మేట

చోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): **శారదా నదిలో వరద తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసురులు అక్రమ తవ్వకాలకు తెర తీస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాల వద్ద ఇసుక తవ్వకాల (అనధికారిక) కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. తాజాగా గవరవరంలో ఇసుక తవ్వకాలకు రెండు రోజుల క్రితం వేలం పాట నిర్వహించినట్టు సమాచారం.**

ప్రభుత్వం కల్పించిన ఉచిత ఇసుక పథకాన్ని కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాస్తవంగా జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. అయితే ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతు పనుల కోసం స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో ఇసుకను తవ్వి, టైరు బండ్లతో తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అయితే ముందుగా స్థానిక సచివాలయంలో అనుమతులు తీసుకోవాలి. కానీ గ్రామాల్లో రాజకీయ పెత్తనం చెలాయిస్తున్న నేతలు, నదుల్లోని ఇసుక వనరులను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపిస్తున్నారు. దీంతో నదిగట్లు కోతకు గురవుతున్నాయి. వంతెనలు దెబ్బతింటున్నాయి. కాజ్‌వేలు కొట్టుకుపోతున్నాయి. మండలంలోని గవరవరం వద్ద నది గర్భంలో ఇసుకను పూర్తిగా తోడేయడంతోపాటు, నది గట్లను కూడా ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇటీవల తుఫాన్ సమయంలో వచ్చిన వరద ఉధృతికి నది ఒడ్డున ఉన్న జడ్పీ హైస్కూల్, ఇతర ప్రభుత్వ భవనాలు కూలిపోతాయేమోనని స్థానికులు ఆందోళన చెందారు.

ఇదిలావుండగా సుమారు రెండున్నర నెలల నుంచి వర్షాల కారణంగా శారదా నదిలో వరద ప్రవాహం అధికంగా వుంది. ఎగువనున్న జలాశయాలు నిండడంతో గేట్లు ఎత్తుతున్నారు. దీంతో నదిలో వరద ఉధృతి విపరీతంగా పెరిగి, ఇసుక తవ్వకాలు జరపలేని పరిస్థితి ఏర్పడింది. గత వారం సంభవించిన తుఫాన్ కారణంగా నదులు ఉధృతంగా ప్రవహించాయి. ఇదే సమయంలో పలుచోట్ల ఇసుక మేటలు వేసింది. నదిలో వరద బాగా తగ్గడంతో ఇసుకాసురులు రంగంలోకి దిగారు. ఇసుక తవ్వకాల కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు. గవరవరంలో ఇసుక తవ్వకాలకు మంగళవారం వేలం పాట నిర్వహించినట్టు సమాచారం. ఇందులో అధికారంలో వున్న కూటమి పార్టీలతో పాటు, ప్రతిపక్ష వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. వీరి తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నదిలో, రక్షణ గట్లకు సమీపంలో ఎడాపెడా ఇసుక తవ్వకాలు జరిపితే భవిష్యత్తులో శారదా నది గట్లకు గండ్లు పడి గ్రామాన్ని వరద నీరు ముంచెత్తుతుందని ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, గనులు, జలవనరుల శాఖ అధికారులు స్పందించి, శారదా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధించాలని గవరవరం గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శారదా నదిలో వరద తగ్గడంతో బయటపడిన ఇసుక దిబ్బలు

పర్యాటక రంగం అభివృద్ధికి సర్వే

ఉత్తరాంధ్రలో ఎంపిక చేసిన 186 ప్రాంతాల్లో ఇంటింటా వివరాల సేకరణ

- ప్రజల ప్రయాణాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనపై ఆరా

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. పర్యాటక రంగం అభివృద్ధి, సందర్శనీయ ప్రదేశాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సర్వే చేయిస్తున్నది. జాతీయ గృహ ప్రయాణ సర్వే (ఎన్‌హెచ్‌టీఎస్) పేరుతో ఉమ్మడి విశాఖ, విజయగనరం, శ్రీకాకుళం జిల్లాలో ఎంపిక చేసిన 186 ప్రాంతాలలో ప్రస్తుతం సర్వే చేస్తున్నారు. వీటిలో 80 పట్టణ ప్రాంతాలు, 106 గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. గురువారం నర్సీపట్నంలోని పలు ప్రాంతాల్లో జూనియర్ గణాంక అధికారి దేవిశేఖర్, సర్వే ఎన్యుమరేటర్ టి.శంకరరావు ఇంటింటికి వెళ్లి డిజిటల్ సర్వే చేశారు. ఈ ఏడాదిలో ఎప్పుడైనా ప్రయాణం చేశారా? ఎప్పుడెప్పుడు ప్రయాణం చేస్తుంటారు? ప్రయాణం ఎందుకు చేశారు? పర్యాటక ప్రదేశాలను సందర్శించారా? రవాణా సదుపాయాలు ఏమిటి? వంటి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. సేకరించిన సమాచారాన్ని ట్యాబ్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భావిస్తున్నారు. జాతీయ గణాంక అధికారి పర్యవేక్షణలో ఎంపిక చేసిన పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వచ్చే ఏడాది జూన్ వరకు సర్వే జరుగుతుందని అధికారులు చెప్పారు.



ట్యాబ్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న గణాంక అధికారి

పౌర సరఫరాల్లో అక్రమాలు

ఎంఎల్ఎస్ పాయింట్ల సిబ్బంది ఇష్టారాజ్యం

- బియ్యం బస్తాలు తూకం వేయకుండానే రేషన్ డిపోలకు సరఫరా
- టన్నుకు 15-20 కిలోల మేర తరుగు వస్తున్నదని డీలర్ల ఆవేదన
- తూకం వేయాలని పట్టుబడితే.. వేధింపులకు గురిచేస్తారని ఆరోపణ



రావికమతం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద పెద్ద లారీలో నుంచి నేరుగా చిన్న లారీలోకి బియ్యం బస్తాలను లోడింగ్ చేస్తున్న కలాసీలు

రావికమతం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): **పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోని ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. జిల్లా గోదాముల నుంచి ఎంఎల్ఎస్‌కు వచ్చి బియ్యం, ఇతర సరుకులను తూకం వేయకుండానే రేషన్ డిపోలకు సరఫరా చేస్తున్నారు. దీనివల్ల టన్నుకు 15-20 కిలోల మేర తరుగు వస్తున్నదని డీలర్లు వాపోతున్నారు. తూకం వేయాల్సిందేనని తాము పట్టుబడితే లేనిపోని కేసులు నమోదు చేసి, డీలర్‌షిప్‌ను రద్దు చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

రావికమతంలోని పౌరసరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన 95 రేషన్ డిపోలు వున్నాయి. రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయడానికి ప్రతి నెలా సుమారు 600 టన్నుల బియ్యాన్ని ఇక్కడి నుంచి సరఫరా చేస్తుంటారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు మరో 30 టన్నుల బియ్యం పంపుతుంటారు. నిబంధనల ప్రకారం జిల్లా గోదాము/ రైస్ మిల్లుల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు లారీల్లో వచ్చిన బియ్యాన్ని గోదాములోకి దించాలి. తరువాత తూకం వేసి, వేరే వాహనాల్లో రేషన్ డిపోలకు పంపాలి. లేదంటే ఇక్కడకు వచ్చిన పెద్ద లారీల్లో నుంచి ... మిగతా 6వ పేజీలో

విద్యాలయాల్లో సమస్యలపై గళం

ప్రహరీ గోడలు లేకపోవడంతో ఇతరుల ప్రవేశం

- ఏజెన్సీ ఆశ్రమాలకు ఆరోగ్య కార్యకర్తలు అవసరం
- హాస్టళ్లలో శీతాకాలం గోరువెచ్చని తాగునీరు సరఫరా చేయాలి
- జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో గళమెత్తిన సభ్యులు
- గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదు
- గృహ నిర్మాణం, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య శాఖలపై చర్చ



జడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర. పక్కన సీఈవో నారాయణమూర్తి

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ ఆధీనంలోని వివిధ యాజమాన్యాల పరిధిలో వున్న విద్యా సంస్థల్లో సమస్యలపై జడ్పీటీసీ సభ్యులు గళం విప్పారు. విద్యార్థుల రక్షణ కోసం ప్రహరీ గోడల నిర్మాణం, వసతిగృహాల్లో రక్షిత తాగునీటి సదుపాయం వంటి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని కోరారు. ఇంకా గృహ నిర్మాణం, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి పలు అంశాలను సభ్యులు ప్రస్తావించారు.**

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన గురువారం ఇక్కడ ఒకటి, రెండు, నాలుగు, ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. నాలుగో స్థాయీ సంఘ సమావేశంలో విద్యా శాఖపై జరిగిన చర్చలో అరకు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల రక్షణ కోసం ప్రహరీ గోడలు నిర్మించాలని కోరారు. చైర్‌పర్సన్‌తో పాటు అనంతగిరి, కె.కోటపాడు, గొలుగొండ, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు, ఈర్లె అనురాధ, గిరిబాబు, కర్రి సత్యం మాట్లాడుతూ, పాఠశాలలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో ఇతరులు ప్రవేశించి, విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. పాఠశాలలకు రక్షణ కల్పనలో భాగంగా అన్ని ప్రభుత్వ యాజమాన్యాలు స్పందించి పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించాలన్నారు. అనంతగిరి సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ, ఏజెన్సీలోని పలు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, అందువల్ల ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తలు/ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ, శీతాకాలంలో ఆశ్రమాలు, వసతిగృహాల్లో విద్యార్థులు తాగడానికి గోరు వెచ్చని నీటిని సరఫరా చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో వాటర్ ప్యూరిఫైయర్లను బాగుచేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీ బదులిస్తూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రం చేయడానికి సిబ్బంది ఉన్నారని ... మిగతా 6వ పేజీలో



సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

నివాస ప్రాంతాల్లోనూ నిఘా నేత్రాలు


గవరపాలెంలో 80 సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ నిర్ణయం

- వివిధ ప్రదేశాలను పరిశీలించిన సీఐ, ఎస్ఐలు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నివాస ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారుల్లో ఇప్పటికే పలుచోట్ల సీసీ కెమెరాలు బిగించగా.. ఇప్పుడు గవరపాలెం ప్రాంతంలో కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్థానిక ఎంపీ సీఎం రమేశ్ 'ఎంపీ ల్యాడ్స్' నుంచి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వివిధచోట్ల సుమారు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. వీటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపై పట్టణ పీఎస్ సీఐ జి.ప్రేమ్‌కుమార్, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు గురువారం గవరపాలెం ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. ముఖ్యమైన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు వారు తెలిపారు.



గవరపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ జి. ప్రేమ్‌కుమార్, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు



అంధకారంలో పెద్దాస్పత్రి!

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

- మార్చురీ వద్ద పనులు చేస్తుండగా తెగిపోయిన కేబుల్
- పునరుద్ధరణపై దృష్టిసారించని అధికారులు
- వార్డుల్లో చిమ్మ చీకట్లతో రోగుల అవస్థలు
- అత్యవసర విభాగాలకు జనరేటర్ ద్వారా సరఫరా
- నీటి సరఫరా కూడా బంద్

- 6లో

విద్యార్థి ఆత్మహత్య

సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోడుగుళ్ల సమీపంలో వున్న బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడికి చెందిన పత్తిపాటి వీరబాబు(19) ఇంటర్ పూర్తి చేసిన అనంతరం ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా జోడుగుళ్ల వద్దగల బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో చేరాడు. ఈ నేపథ్యంలో ఇంటికి వెళ్లి వస్తానని బుధవారం సాయంత్రం ప్రిన్సిపాల్ బలిరెడ్డి ఉమామహేశ్వరరావుకు మెసేజ్ పెట్టాడు. తమ కుమారుడిని ఇంటికి పంపాలని వీరబాబు తల్లిదండ్రుల నుంచి కూడా సమాచారం వచ్చింది. దీంతో ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారు. గురువారం ఉదయం ఆరు గంటలకు విద్యార్థులంతా పీటీకి బయలుదేరారు. వీరబాబు రాకపోవడంతో ప్రశ్నించారు. తాను ఇంటికి వెళుతున్నానని, ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారని చెప్పాడు. దీంతో తోటి విద్యార్థులు పీటీకి వెళ్లిపోయారు. తిరిగి 7.20 గంటలకు రూమ్‌కు వచ్చి చూడగా వీరబాబు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పరిశీలించగా వీరబాబు అప్పటికే మృతిచెందాడు. అనంతరం ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని కిందకు దించి ల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పత్తిపాటి వీరబాబు (ఫైల్ ఫొటో)

టెన్త్ ప్రణాళికలపై ఎంఈవోలు ఆరా


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవోలు నరేశ్, నాగన్నదొర

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఎంఈవోలు కె.నరేశ్, రుత్తల నాగన్నదొర తనిఖీ చేశారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నందున టెన్త్ ప్రణాళికల అమలు, విద్యార్థుల సామర్థ్యం, తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లో విద్యాబోధన చేయవద్దని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. సకాలంలో టెన్త్ సిలబస్ పూర్తి చేసి, కొన్ని సబ్జక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెచ్‌ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు కుమారి, ఆచార్యులు, ఫాల్గుణరావు పాల్గొన్నారు.

'సమాజంలో గురువులదే కీలకపాత్ర'


హెచ్‌ఎం ఆదినారాయణ దంపతులను సత్కరిస్తున్న బుజ్జి తదితరులు

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తూ, ఉత్తమ సమాజ నిర్మాణానికి పాటుపడుతున్న గురువుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. గురువారం ఉపమాక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ పదవీవిరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, వెంకటప్పారావు, కనకరాజు, పీఆర్‌టీయూ ప్రతినిధులు టీవీ రమణ, ప్రగడ శివాజీ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ

పాయకరావుపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అక్కిరెడ్డి నూకరాజు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, ఏనుగు చిన్నా, పెదిరెడ్డి శ్రీరాములు, వడ్డాది వాసు, శిధిరెడ్డి నాగేశ్వరరావు, వేములపూడి అప్పారావు, కట్టా శ్రీను, కీర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో నక్కపల్లి డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

నక్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న సంజన, జూహీప్రియ విజేతలుగా నిలిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య గురువారం చెప్పారు.

శ్రీప్రకాష్‌లో ప్రారంభమైన రిమ్ జిమ్


గ్రామీణ వేషధారణతో జానపద గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో గురువారం రిమ్ జిమ్-2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేషధారణలు,సంప్రదాయ నృత్యాలు, పాటలతో అలరించారు. అంతకుముందు కార్యక్రమాన్ని ప్రారంభించిన విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు మూడు రోజులు పాటు జరిగే రిమ్‌జిమ్‌లో 5,500 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, కన్వీనర్ నీలాదేవితోపాటు అకడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కల చెట్టుకొమ్మలు తొలగింపు

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రోడ్డులో భారీగా పెరిగిపోయిన చెట్టు కొమ్మలను ఆర్అండ్‌బీ అధికారులు తొలగిస్తున్నారు. అచ్యుతాపురం సెజ్ కారణంలోని ఈ రోడ్డులో భారీ నుంచి అతి భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఇరుకు రోడ్డుపైకి చెట్టుకొమ్మలు రావడంతో భారీ వాహన చోదకులకు ఇబ్బందులను కలుగుతోంది. దీంతో ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని గమనించిన ఆర్అండ్‌బీ అధికారులు యంత్రాల సహాయంతో చెట్టు కొమ్మలను తొలగిస్తున్నారు.

పాడి రైతులకు అండగా హెరిటేజ్

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ ఉంటుందని మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. గురువారం నాయనమ్మ పాలెం జరిగిన పాడిరైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పాడి పశువులతో పాటు రైతులకు కూడా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో 40 పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాము, ఆర్.అప్పలనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు


అణుకు గిరిజనులతో సమావేశమైన అధికారులు

కోటవురట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎంపీ డీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పీఎం జన్‌మన్‌లో భాగంగా మండల అధికార యంత్రాంగం గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పంచాయతీ స్థలాలపై నివేదిక సిద్ధం

- 'పేట'లో 48 అక్రమ లేఅవుట్లుగా నిర్ధారణ
- పంచాయతీలో నమోదుకాని స్థలాల జోలికి వెళ్లని అధికారులు
- త్వరలో వీఎంఆర్‌డీఏ అధికారులకు నివేదిక


స్థానిక గెస్టుహౌస్ ఎదుట ఖాళీ స్థలంలో పంచాయతీ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

పాయకరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో ఇప్పటివరకు వేసిన లేఅవుట్లలో పంచాయతీ స్థలాలను గుర్తించిన అధికారులు త్వరలో వీటి బాధ్యతను వీఎంఆర్‌డీఏ అధికారులకు అప్పగించేందుకు నివేదిక సిద్ధం చేశారు. పంచాయతీలో సుమారు 200 ఎకరాల్లో వీఎంఆర్డీఏ నిబంధనలు పాటించకుండా వేసిన లేఅవుట్లలో రోడ్లు, డ్రెయిన్లు తదితర కనీస వసతుల్లేని కారణంగా వీటిలో ప్లాట్లు కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఈ లేఅవుట్లలో ప్రజోపయోగం కోసం పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం స్థలాన్ని కూడా రియాల్టర్లు, రాజకీయ నాయకుల ఒత్తిడికి అధికారులు తలొగ్గడంతో తీర్మానాల ద్వారా 5 శాతానికి తగ్గించడంతో పాటు అవి కూడా పనికిరాని కోసుముక్కలు కేటాయించిన విషయం కూడా తెలిసిందే. అయితే ఈ స్థలాలను పంచాయతీ అధికారులు ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో వీటిలో పలు స్థలాలు ఆక్రమణలకు గురై క్రయవిక్రయాలు, ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. ఈ విషయం రాష్ట్ర హోంమంత్రి అనిత దృష్టికి వెళ్లడంతో ఆమె స్పందించారు. పాయకరావుపేటలో అక్రమ లేఅవుట్లు, పంచాయతీ స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు రికార్డుల ఆధారంగా పంచాయతీ స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమ లేఅవుట్ల వివరాలు సేకరించి నివేదిక రూపొందించారు. నివేదిక ఆధారంగా పంచాయతీలో ఇప్పటివరకు 51 లేఅవుట్లు వేయగా..వీటిలో మూడింటికి మాత్రమే వీఎంఆర్డీఏ అనుమతులు ఉండగా.. మిగిలినవన్నీ అక్రమ లేఅవుట్లుగా గుర్తించారు. ఇదిలా ఉంటే అక్రమ లేఅవుట్లను ఆనుకుని ఉన్న భూములను పక్క లేఅవుట్లలో పేర్కొన్న సర్వే నంబర్లతో పంచాయతీకి కూడా తెలియకుండా ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరిపినవి పాయకరావుపేటలో పదుల సంఖ్యలో ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే పంచాయతీ అధికారులు వీటి జోలికి వెళ్లనట్టు తెలుస్తోంది. అదేవిధంగా గుర్తించిన అక్రమ లేఅవుట్లలో పంచాయతీ స్థలాలుగా కేటాయించిన కోసు ముక్కల్లో ఒకటి, రెండు గుర్తించారు. మిగిలిన ముక్కల జోలికి వెళ్లనట్టు తెలుస్తోంది. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కె.డేవిడ్‌ను వివరణ కోరగా.. పంచాయతీలో ఉన్న రికార్డుల ఆధారంగా 51 లేఅవుట్లు వేశారని, వీటిలో మూడు తప్పించి మిగిలిన 48 లేఅవుట్లు అక్రమ లేఅవుట్లుగా గుర్తించామన్నారు. వీటిలో పంచాయతీకి కేటాయించిన స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను రూపొందించామని, త్వరలో వీఎంఆర్డీఏ అధికారులను అందజేయనున్నామన్నారు. అప్పటినుంచి వీటి రక్షణ బాధ్యత వీఎంఆర్డీఏ తీసుకోనుందన్నారు. పంచాయతీలో నమోదుకాని లేఅవుట్లను ఇంకా గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు.

లక్ష్మీనగర్ కాలనీలో నిలిచిన మురుగునీరు

- దుర్వాసన భరించ లేక ఇబ్బంది పడుతున్న కాలనీ ప్రజలు ..
- పట్టించుకోని అధికారులు


లక్ష్మీనగర్‌కాలనీ భవంతుల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపు నీరు

పాయకరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వర్షాలకు నీట మునిగిన పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీ వాసులు మురికినీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు తగ్గి రోజులు గడుస్తున్నా మురికినీరు కాలనీ నుంచి బయటకు వెళ్లలేదు. దీంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

పాయకరావుపేట పంచాయతీలోని ఇప్పటివరకు వేసిన లేఅవుట్లలో టౌన్ ప్లానింగ్ నిబంధనలు పాటించని కారణంగా పలు కాలనీల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు బయటకు పోయేందుకు అవుట్‌లెట్లు లేక ఖాళీ స్థలాలు, శివారు ప్రాంతాలు మురికినీటి చెరువులుగా మారుతున్నాయి. దీంతో సమీప నివాసితులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురికినీరు తమ ఇంటి ముందుకు రాకుండా ఎత్తు చేస్తుండడంతో ముందుకు పారే అవకాశం లేక రోడ్లపైనే ప్రవహిస్తున్నది. ఇటీవల పడిన భారీ వర్షాలకు పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నిలిచిన మురికి నీటికి తోడు వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్నవారే లేరని కాలనీవాసులు వాపోతున్నారు. ఇళ్ల ముందు నిలిచిన మురికినీటిలో రాకపోకలు సాగించలేక పోతున్నామని వాపోతున్నారు. ఇళ్లలోకి పాములు వస్తున్నాయని, దోమలకు భయపడి రాత్రి, పగలు తలుపులు, కిటికీలు మూసుకుని ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీల్లో మురికినీరు బయటకు తరలిపోయేలా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


లక్ష్మీనగర్ కాలనీలో ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగునీరు

దరఖాస్తు చేసుకుంటే ఒక్క రోజులోనే ఆన్‌లైన్‌లో నమోదు : తహశీల్దార్

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దొప్పెర్ల బార్క్ నిర్వాసితులు దరఖాస్తు చేసుకుంటే ఒక రోజులోనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహశీల్దార్ బి సత్యనారాయణ తెలిపారు. 'అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. బార్క్ నిర్వాసితుల నుంచి తీసుకున్న భూములకు ఇటీవలే ఏ,బీ సబ్ డివిజన్‌లుగా విభజించామన్నారు. ఏ సబ్ డివిజన్‌లో భూమి బార్క్‌కి చెందినదిగా, బీ సబ్ డివిజన్ భూమిని రైతులకు చెందినదిగా కేటాయించామన్నారు. కొందరు రైతుల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. ఒకే సర్వే నంబర్‌లో వివిధ రైతులకు చెందిన భూములుంటాయని, వారి సరిహద్దులు ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఒకే రైతుకు సంబంధించిన భూమి ఉంటే వాటిని ఇప్పటికే సుమోటోగా భావించి ఆన్‌లైన్ చేశామన్నారు. నిర్వాసిత రైతులు తమ రికార్డులు రుజువులతో దరఖాస్తు చేసుకుంటే ఒక్క రోజులో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

చెత్త కాలిస్తే క్రిమినల్ కేసు

ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా చెత్తను కాలిస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయాలు కార్యదర్శులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ జరగాలన్నారు. ఎప్పటికప్పుడు సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. రానున్న 3, 4 రోజుల్లో మరో తుఫాన్ వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉదయం 6 గంటలకే విధులకు హాజరుకావాలి

పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌డీవో నాగలక్ష్మి ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో నాగలక్ష్మి

ఎస్.రాయవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజూ ఉదయం 6 గంటలకే విధులకు హాజరై గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని డీఎల్‌డీవో నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి, ఆయా గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనుల అమల తీరును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టడమే కాకుండా ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా హాకీ ఫెడరేషన్ శత వసంతోత్సవ ర్యాలీ


ఎలమంచిలిలో హాకీ ఫెడరేషన్ శత వసంత ర్యాలీలో పాల్గొన్న అధికారులు, క్రీడా సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ హాకీ ఫెడరేషన్ శత వసంతాల ర్యాలీని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఈ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కన్వీనరు కొఠారు నరేష్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ హాకీ క్రీడలో ఎలమంచిలి క్రీడాకారులు చూపుతున్న ప్రతిభ అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో లక్ష్యసాధనకు ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. హాకీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ ఇండియా హాకీ ఫెడరేషన్ ఏర్పడి ఈనెల 7వ తేదీకి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఏటా జాతీయ స్థాయి పోటీల్లో ఎలమంచి క్రీడాకారులు రాణిస్తున్నారన్నారు. అనంతరం క్రీడామైదానం నుంచి ర్యాలీ క్లబ్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జీవీ. రెడ్డి, ఎంకే.సాయిరాం, డి.మహేష్, రైతు సంఘం జిల్లా ప్రెసిడెంట్ సీతారామ్, ఉపాధ్యాయులు, పీఈటీలు కిషోర్, రాజు, ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారి నిజాయితీ


పోలీసులకు కవర్‌ని అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన కవర్‌ని పోలీసులకు అప్పగించి తన నిజాయితీని అరటి పళ్ల వ్యాపారి నిరూపించుకున్నారు. సీఐ నమ్మి గణేశ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. సింగంపల్లి అప్పలనర్సమ్మ అచ్యుతాపురం జంక్షన్‌లో అరటి పళ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం ఉదయం అరటి పళ్లు విక్రయకేంద్ర వద్ద రోడ్డుపై ఒక కవరు కనిపించింది. దీనిని తీసుకొని చూడగా అందులో నగదుతో పాటు, సెల్‌ఫోన్, కొన్ని కాగితాలు ఉన్నాయని, దీనిని అప్పలనర్సమ్మ వెంటనే తమకు అప్పగించిందని ఆయన తెలిపారు. కవర్‌లో రూ.4,500 నగదు, సెల్‌ఫోన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంక్ బుక్ ఉన్నాయన్నారు. వీటి ఆధారంతో పోగొట్టుకున్న వ్యక్తి అచ్యుతాపురానికి చెందిన నాగమంత్రి జయశ్రీకి చెందినవిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని ఆయన తెలిపారు. అప్పలనర్సమ్మ నిజాయితీని అంతా మెచ్చుకున్నారు.

గుమ్మడి అమ్మలు తల్లి పేరంటాల ఉత్సవాలు ప్రారంభం


వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తూరులోని కొలువైన గుమ్మడి అమ్మలు తల్లి పేరంటాలు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలను ఎమ్మెల్యే విజయకుమార్ వారి కుటుంబ సభ్యులతో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు రాజకీయ ప్రముఖులు కూడా అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. రెండు రోజులు పాటు అమ్మవారి ఉత్సవాలు వైభోగంగా జరగనున్నాయి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభం

గుమ్మడి అమ్మలు తల్లి పేరంటాలు అమ్మవారి ఉత్సవాల సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే విజయకుమార్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణంపాలెం'నిర్వాసితులకు న్యాయం చేయాలి

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

రాంబిల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులకు న్యాయం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వైసీపీ నేతలు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, తదితరులతో కలిసి అమర్‌నాథ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను వారికి వివరించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన జీవోను పక్కన పెట్టి ఎమ్మెల్యే, అధికారులు న్యాయం చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిర్వాసితులు ఆరోపించారు. నిర్వాసితుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు కూడా ఆర్అర్ ప్యాకేజీతో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవో, ఎమ్మెల్యేలకు పలుమార్లు విన్నవించుకొన్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం వారి జీవితాలతో ఆటలాడుతుందన్నారు. నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిశోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, జడ్‌పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, అచ్యుతాపురం జడ్‌పీటీసీ సభ్యులు లాలం రాంబాబు, వైసీపీ నాయకులు, కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసిత నాయకులు, కుటుంబాలు పాల్గొన్నారు.


నిర్వాసితుల సమస్యలను తెలుసుకుంటున్న వైసీపీ నాయకులు

లైనుకొత్తూరులో వన మహోత్సవం


వన మహోత్సవంలో పాల్గొన్న కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీఓ కొండలరావు

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సమీపంలో గురువారం అధికారులు వన మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు నిర్వహించిన వనమహోత్సవంలో తొలుత ఉసిరికి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ కేఎస్. కొండలరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహశీల్దారు వరహాలు, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు వివిధ శాఖల అధికారులు, వైస్ ఎంపీపీ రాజాన శేషు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి ఇంటర్ విద్యార్థిని ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ఇంటర్ విద్యాశాఖాధికారి వినోద్‌బాబు

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న తోట సన్యాసమ్మ ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గం తరఫున మాక్ అసెంబ్లీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. అనకాపల్లిలో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థిని సన్యాసమ్మ ఎంపికైనట్టు తెలిపారు. ఈ విద్యార్థిని ఈనెల 26వ తేదీన అమరావతిలో జరిగే కార్యక్రమంలో ఎలమంచిలి అసెంబ్లీ తరఫున పాల్గొంటుందని తెలిపారు. మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థినిని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వినోద్‌బాబు, ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పోతురాజుస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

మునగపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ-గవర్ల అనకాపల్లి గ్రామంలో పోతురాజుస్వామి విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో కొన్ని నెలలుగా శరవేగంగా మరిడిమాంబ ఆలయం నిర్మాణం జరుగుతోంది. అదే ప్రాంగణంలో పోతురాజుస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గురువారం శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, పొలమరశెట్టి నాగేశ్వరరావు, పొలమరశెట్టి ఆనందరావు, బాగేశ్వరరావు, రాపేటి పరమేశ్, బొడ్డేడ శ్రీనివాసరావు, ఆళ్ల అనిల్‌కుమార్, సాంబశివ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

అచ్యుతాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో గల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అచ్యుతాపురం, కొండకర్ల, మడుతూరు, సెజ్ పునరావాస కాలనీ, నునపర్తి శిద్ధాశ్రమం, దొసూరు, పెదపాడు, ఎంజేపురం తదితర గ్రామాల శివాలయాల్లో బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎంజేపురంలో జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో భజన కార్యక్రమాలను నిర్వహించారు.

పెంటకోటలో ఉచిత పశు వైద్య శిబిరం

పాయకరావుపేట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోటలో గురువారం ఉచిత పశు వైద్య గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 70 పశువులకు వైద్య సేవలు అందించినట్టు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు వడ్డి శ్రీధర్ తెలిపారు. 20 పశువులకు గర్భకోశ వ్యాధులు, 10 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశామన్నారు. ఎదకు రాని రెండేళ్లు దాటిన గేదె దూడలకు వైద్యం అందించారు. 30 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. పశువులకు సమతుల్యమైన ఆహారం, తగినంత మినరల్స్, విటమిన్లు అందించడం ద్వారా వాటి రోగనిరోధక శక్తిని పెంచాలన్నారు. పశువులలో వచ్చే వ్యాధులకు టీకాలను వేయించాలన్నారు. ఈ సందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వైద్యులు గుప్తా, శ్రీనివాస్, శరణ్య, సిబ్బంది, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపు గ్రామసభలు

కోటవురట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులను గుర్తింపునకు పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఏపీవో నాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని లింగాపురంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామసభలు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి వేతనాలకు రూ.29 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు పాల్గొని వారికి కావలసిన పనులను ప్రతిపాదించవచ్చునని ప్రజాప్రతినిధులకు సూచించారు.

ఆహ్లాదం.. సుదూరం!

కళావిహీనంగా లుపిన్ ఉద్యానవనం
అధ్వానంగా పార్కు పరిసరాలు
అస్తవ్యస్తంగా పిల్లల ఆట పరికరాలు
పెరిగిపోయిన తుప్పలు.. విరిగిన కుర్చీలు
పట్టించుకోని అధికారులు, పాలకులు
మండిపడుతున్న పరవాడ ప్రజలు


ఆనవాలు కోల్పోయిన పార్కులో తుప్పల మధ్య ఉన్న పిల్లలు వినియోగించే ఊయల

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉద్యానవనం కళావిహీనంగా తయారైంది. పరిసరాలన్నీ అధ్వానంగా మారాయి. కనీసం లోపలకు తొంగి చూడడానికి కూడా భయపడేలా పరిస్థితులు ఉన్నాయి. ఫలితంగా ఆహ్లాదానికి దూరమవుతున్నామని పరవాడ ప్రజలు మండిపడుతున్నారు.

పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు దుర్గ మాంబ ఆలయం వెనుక పార్కు ఏర్పాటు చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా లుపిన్ ఫౌండేషన్ యాజమాన్యం 2019లో సుమారు 70 సెంట్ల స్థలంలో ఈ ఉద్యానవనాన్ని వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలు, కూర్చొనేందుకు బెంచీలు, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌక ర్యానికి బోరు కూడా తవ్వించారు. నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడంతో వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. కొంతకా లం తరువాత పార్కు నిర్వహణ బాధ్యతను పంచాయతీకి అప్పగించారు. కొంత కాలం పాటు నిర్వహణ బాగానే చేపట్టారు. రాను రాను నిర్వహణ బాధ్యతను గాలికొదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. పార్కు ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలతో పాటు ఇనుప బెంచీలు తుప్పు పట్టి నిరుపయో గంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ఎల్ఈడీ దీపాలు కనుమరుగవ్వగా,


పార్కులో తుప్పలతో మూసుకుపోయిన నడక మార్గం


పార్కులో తుప్పు పట్టిపోయి నిరుపయోగంగా ఉన్న ఇనుప బెంచీ

మరికొన్ని దీపాల చుట్టూ తీగలు అల్లుకుని కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో పార్కు కళావిహీనంగా మారింది. నడక మార్గం కూడా దారుణంగా తయారైంది. రాత్రుల సమయంలో మందుబాబులు పార్కును బార్‌లా వినియోగించుకుంటున్నారు. పంచాయతీ అధికా రుల పర్యవేక్షణ కొరవడడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో స్థాని కులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకువచ్చేలా తగిన చర్యలు చేపట్టాలని పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పార్కు ప్రాంగణం



-కోనేటి మూర్తి, పరవాడ

పార్కు ప్రాంగణం అధ్వానంగా తయారైంది. పిచ్చి మొక్కలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. బెంచీలు తుప్పు పట్టేశాయి. దుర్వాసన వెదజల్లడంతో పార్కులో కాసేపు సేద తీరుదామన్నా కూర్చొలేని పరిస్థితి నెలకొంది. వాకింగ్ ట్రాక్ కూడా దారుణంగా మారింది. మందుబాబులకు అడ్డాగా తయారైంది.

అధికారులు పట్టించుకోవాలి



-లాలం ముత్యాలనాయుడు, పరవాడ

పార్కు అభివృద్ధికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కును నిర్లక్ష్యంగా వదిలేయడం తగదు. పిల్లలు, పెద్దలు కాసేపు ప్రశాంతంగా గడపటం కోసం ఏర్పాటు చేసిన పార్కు నేడు అధ్వానంగా తయారవ్వడం చాలా బాధాకరం. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టిసారించి పార్కును వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలి.


పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పుస్తక పఠనం అలవాటుగా మారాలి

▸ అనకాపల్లి ప్రజలకు అద్భుత అవకాశం
▸ పుస్తక ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ పుస్తక పఠనం అలవాటుగా మారాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను గురువారం ఆమె సందర్శిం చారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన అన్ని స్టాల్స్‌ను ఆసక్తిగా పరి శీలించారు. అలాగే పలువురు విద్యార్థులు కొనుగోలు చేసిన పుస్తకాలను పరిశీలిం చారు. వాటిపై విద్యార్థులకు ఉన్న ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన అనకాపల్లి ప్రజలకు అద్భుత అవకాశమని చెప్పారు. విద్యా ప్రమాణాలతో పాటు విజ్ఞానం పెంపునకు పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ వంద పబ్లిషర్స్ కలిసి సుమారు పది వేలు పుస్తక శీర్షికలను ప్రదర్శనలో ఉంచారన్నారు. ఈ నెల 7వ తేదీతో పుస్తక ప్రదర్శన ముగిస్తుందని ఆయన తెలిపారు.

పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు


గవరపాలెంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చిస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణ పోలీసులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పట్టణ పరిధిలోనే కాకుండా గవరపాలెం ప్రాంతంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం పార్లమెంట్ స భ్యులు సీఎం రమేశ్ ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేసినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ఈ నిధులతో సుమారు 80 చోట్ల 80 సీసీ కెమె రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడెక్కడ కెమెరాలు అ వసరమో, ఎక్కడెక్కడ లేవో సీఐ జి.ప్రేమ్‌కుమార్, ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు గురువారం పట్టణంలో పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో, నిత్యం జనవాసాలు ఉన్న చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయ శ్లాబ్ మరమ్మతు పనులు ప్రారంభం


పనులు ప్రారంభించిన పీలా

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి ఆలయ శ్లాబు మరమ్మతు పనులను గురువారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పూజ చేసి ప్రారంభించారని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ మురళీ తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో శ్లాబు దెబ్బ తినడం వల్ల వర్షపు నీరు ఆలయ ఆవర ణలోకి రావడంతో, వాటి మరమ్మతు ప నులను మాజీ ఎమ్మెల్యే పీలా చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీ కృష్ణ, పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసర సరకులు


చేనేత కార్మికులకు సరకులు పంపిణీ చేస్తున్న నాయకులు

కశింకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ శివారున బంగారయ్యపేట గ్రామంలో చేనేత కార్మికులకు గురువారం కూటమి నాయకులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. 18 మందికి 50 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో చొప్పున కందిపప్పు, ఆయిల్, ఉల్లిపాయలు, బంగా ళదుంపలు అందజేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా మధ్యంతర భృతిగా కార్మికులను ఆదుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కూటమి నాయకులు ఉల్లింగల రమేశ్, ఆంధ్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యథార్థ ఘటన ఆధారంగా 'రోలుగుంట సూరి'

▸ చిత్ర దర్శకుడు అనిల్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు అనిల్, తదితరులు

సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట మండల పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా 'రోలుగుంట సూరి' సినిమా నిర్మించినట్టు చిత్ర దర్శకుడు అనిల్‌కుమార్ పల్లా తెలిపారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో చిత్ర బృందంతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది నూతన నటీనటులతో తీసిన రియలిస్టిక్ సినిమా అన్నారు. తన సోదరుడు నాగార్జున, ఆధ్యారెడ్డి, భావన హీరోహీరోయిన్లుగా, బ్రహ్మానందరెడ్డి విలన్‌గా నటించారన్నారు. ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకోగా.. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ నెల 14న 150 థియేటర్లలో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో చిత్ర హీరో నాగార్జున, నటుడు బ్రహ్మానందరెడ్డి, పల్ల తాతారావు, ఎ.ప్రసాద్, సంతోశ్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు

పరవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేకపో వడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి గాజువాక, విశాఖపట్నం, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, అచ్యుతాపురం, ఎలమంచిలి తదితర ప్రాంతాలకు కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. అయితే షెల్టర్ లేకపోవడంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు వచ్చేవరకు ఎండలో వేచి ఉంటున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడానికి కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

▸ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేస్తున్న పీలా

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో మౌలిక సదుపా యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చెప్పారు. గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో పది మంది బాధితులకు సుమారు రూ.5.28 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నట్టు ఆయన చెప్పారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకువెళ్తున్న ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో మరిడిమాంబ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు, తదితరులు

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెన్నెలపాలెం ప్రజల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి పండుగను గురువారం వైభవంగా జరుపు కున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, జనసేన పార్టీ పరవాడ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైలా రథాల సన్యాసిరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

వేతనాల కోసం భోజన కార్మికుల నిరసన




నినాదాలు చేస్తున్న భోజన పథకం కార్మికులు

పరవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు చెల్లించాలని డి మాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గురువారం వాడచీపు రుపల్లి హైస్కూల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ మండల ప్రతినిధి కె.ఆదిలక్ష్మి మాట్లాడుతూ రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఈ క్రమంలో అప్పులు చేసి భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించాలని కోరారు. యూనియన్ మండల గౌరవాధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లా డుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫాం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కె.లక్ష్మి, రత్నకుమారి, సత్యవతి, పార్వతి, నూకాలమ్మ, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని 80వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు చెప్పారు. సమస్యలను విద్యా కమిటీ చైర్మన్ జోగినాయుడు దృష్టికి తీసుకువెళ్లగా గురువారం జనసేన నాయకుడు బుద్ధ శ్రీనివాసరావుతో కలిసి హైస్కూల్‌ను సంద ర్శించారు. పాడైపోయిన ఆర్‌వో ప్లాంట్‌ను అందుబాటులోకి తీసు కువచ్చేలా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ దృష్టికి తీసుకువెళ్లి, త్వరగా పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపడతామని జోగినాయుడు తెలిపారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. అంతేకాకుండా డెమో కూడా ఇచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెలా సేవా కార్యక్రమాల్లో భాగంగా సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ డీడీ నాయుడు మాట్లాడుతూ గుండెపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీ, డాక్టర్ దివాకర్, క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ


బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సబ్బవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆత్మరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రాణీ లక్ష్మీబాయి స్వీయ రక్షణ శిక్షణ కార్య క్రమం ఏర్పాటు చేసినట్టు జిల్లా బాలిక అభివృద్ధి అధికారి (రాజీవ్ విద్యా మిషన్) జమీమా చెప్పారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూలో నెల రోజుల పాటు బాలికలకు శిక్షణ ఇస్తారన్నారు. ఎంఈవో రవీంద్రబాబు మాట్లాడుతూ ఈ శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాణీ రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ స్వరాజ్యం, ఎస్‌వో మృదుల, తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి చవల చంద్రశేఖర్, కోచ్‌లు బీవీ అప్పారావు, షేక్ హుస్సేన్, తులసీరావు, నాగరాజు పాల్గొన్నారు.

టెలిఫోన్ సలహా కమిటీ సభ్యుడిగా రాజేశ్వరరావు


రాజేశ్వరరావుకు నియామక పత్రం అందిస్తున్న ఎంపీ సీఎం.రమేశ్

తుమ్మపాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా టెలిఫోన్ సలహా కమిటీ సభ్యుడిగా చోడవరం నియోజకవర్గం లోని గుడిప్ప గ్రామానికి చెందిన బీజేపీ నేత గల్లా రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేశ్ చేతుల మీదుగా గురు వారం నియామకపు పత్రాన్ని అందుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను చిత్త శుద్ధితో నిర్వహిస్తానని చెప్పారు. టెలికం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వివరిం చారు. కీలక బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబా మందిర వార్షికోత్సవం


బాబాను దర్శించుకుంటున్న ప్రభాకర్‌శర్మ, దాడి రత్నాకర్

కొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌జీవో కాలనీలో సిద్ధి వినాయక, దత్తాత్రేయ, షిర్డీసాయిరాం మందిరాల 16వ వార్షికోత్సవం గురు వారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సేవా, సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించారు. దత్త ఉపాసకులు, దత్తదాసు గాయిత్రి సాధకులు నూకల ప్రభాకర్‌శర్మ పాల్గొని ప్రవచనాలు చెప్పారు. డైట్ విద్యా సంస్థల అధినేత దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సిద్ధివినాక, షిరిడీసాయి అభయాంజనే య సేవా సమితి అధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి డాక్టర్ ఆర్.ఆర్.సత్యనారాయణ, ప్రధాన అర్చకులు అరవెల్లి వెంకటదివాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం/లంకెలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సెక్షన్ డి1 పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే పెదముషిడివాడ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ-మర్రిపాలెం, గొన్నవానిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్‌టీఐ దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వండి

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరు మల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు నియామకం కోసం ముందుగా వెలువడిన నోటిఫికేషన్ వివరాలను ఆర్‌టీఐ దరఖాస్తుదారుడు కాండ్రేగుల వెంకటరమణకు అందజేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దేవదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయాల అధికారులను ఆదేశించారు. గురువారం వర్చువల్ విధానంలో కమిషనర్ సునీల్ నాలుగు ఆర్‌టీఐ అప్పీళ్లను విచారించారని ఆర్‌టీఐ ఉద్యమకర్త వెంకటరమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. ట్రస్టు బోర్డు నియమావళి, నోట్ ఫైళ్లు, వివిధ దేవాలయాల్లో భక్తు లకు ఉన్న హక్కులు, కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రొటోకాల్ దర్శన నిబంధనల కాపీలను తక్షణమే ఆర్‌టీఐ దరఖా స్తుదారుడికి అందజేయాలని కమిషనర్ ఆదేశించినట్టు చెప్పారు. జాప్యానికి కారకులైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు కమిషనర్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్కు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

తుమ్మపాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు నిర్ణ యాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు డిమాండ్ చేశారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే స్థానికులు ఇబ్బందులు పడతారన్నారు. పర్యావరణ కాలుష్యం తీవ్రతరమై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు లంకెలపాలెంలో వైద్య శిబిరం

లంకెలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79 వార్డు పరిధిలోని లంకెలపాలెం రామా లయం వద్ద శుక్రవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి నట్టు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పది గంటలకు శిబిరం ప్రారంభమవుతుంద న్నారు. వైద్యులు ఆరోగ్యలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు. శిబిరానికి ఆధార్ కార్డును తీసుకొని హాజరు కావాలని సూచించారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తాం: సివేరి సోమ



మంత్రి సంధ్యారాణిని సన్మానిస్తున్న సివేరి సోమ కుటుంబ సభ్యులు

అరకులోయ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో దివంగత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబసభ్యులు టీడీపీ నేతలతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సోమ రెండో కుమారుడికి ప్రభుత్వం డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగం రావడంలో మంత్రి సంధ్యారాణి కృషి చేసిన నేపథ్యంలో సాలూరులోని ఆమెను స్వ గృహంలో గురువారం కలిసి సన్మానించారు. సివేరి పెద్ద కుమారుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం ఈ సందర్భంగా ఆ వివరాలను తెలిపారు. అరకు నియోజకవర్గంలో టీడీపీ పటిష్టతకు చిత్తశుద్ధితో పనిచేయాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయబావుటా ఎగురవేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యకలాపాలను గ్రామగ్రామాన వివరించాలని మంత్రి సూచించారు. పార్టీకి విధేయుడిగా కష్టపడి పనిచేస్తామని అబ్రహం ఈ సందర్భంగా ఆమెకు హామీ ఇచ్చారు.

మలేరియాపై అప్రమత్తం: జిల్లా అధికారి తులసి



జీనబాడు పాఠశాలలో పరిశీలిస్తున్న అధికారి తులసి, తదితరులు

అనంతగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను జిల్లా మలేరియా అధికారిణి ఎం. తులసి గురువారం సందర్శించారు. బుధవారం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జ్వరం, కడుపునొప్పి రావడంతో దేవరాపల్లి ఆస్పత్రికి తరలించి ఆర్‌టీడీ పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరికి మలేరియా పాజిటివ్ రావడంపై కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. దీంతో అప్రమత్తమైన జిల్లా మలేరియా అధికారి ముందుగా కె.కోటపాడు ఆస్పత్రికివెళ్లి, విద్యార్థినులకు తిరిగి రక్త పరీక్షలు చేయగా ఇద్దరికీ నెగిటివ్ వచ్చింది. చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉండడంతో అక్కడ నుంచి జీనబాడు ఆశ్రమ పాఠశాలకు వచ్చారు. చుట్టు పరిసరాల ప్రాంతాలను పరిశీలించి, వాడుక నీరు నిల్వలేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థినులకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని వార్డెన్ శివకుమారికి ఆదేశించారు. అనంతరం పినకోట పీహెచ్‌సీని తనిఖీ చేసి, ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి జి.వెంకటేష్, అనకాపల్లి జిల్లా సహాయ మలేరియా అధికారి ఎ.జె.సత్యనారాయణ, మలేరియా కార్యాలయ అధికారి జి.శ్రీను, సబ్‌యూనిట్ అధికారి బి.బాబూరావు, ఎంపీహెచ్‌ఈఓ గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, పర్యవేక్షకులు రామకృష్ణ, పాల్గొన్నారు.

మద్దిగరువునే మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న మండల సాధన సమితి నాయకులు

జి.మాడుగుల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ప్రజాభిప్రాయం మేరకే మద్దిగరువు పంచాయతీలోనే మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. పెదబయలు మండలాన్ని విభజించి కొత్తగా గోమంగి మండలం ఏర్పాటుకు రెవెన్యూ శాఖ కోరినట్లు గురువారం పత్రికల్లో వార్తలు రావడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జి.మాడుగుల, పెదబయలు మండలాల మధ్యలో నున్న మద్దిగరువును మండలం ఏర్పాటుకు 10 పంచాయతీల ప్రజలు మద్దతుతోపాటు తీర్మానాలు చేశారని అన్నారు. ఇవి ప్రస్తుతం ప్రభుత్వానికి చేరకుండానే గోమంగి మండలంగా ఎలా కోరతారని రెవెన్యూ శాఖను ప్రశ్నించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా అభివృద్ధిలో వెనుకబడి ఉన్న మద్దిగరువును మండలం ఏర్పాటు చేయలన్నారు. సరైన ప్రజాభిప్రాయ సేకరణలేకుండా గోమంగిని మండలంగా సూచించడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, మాజీ సర్పంచ్ టి.రాంబాబు, బీసీవై పార్టీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి కె.రాజన్, జనసేన మండల నాయకుడు టి.వెంకటరమణ, రమణబాబు, కె.కామేశ్వరరావు, టి. రామారావు, వెంకటరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన



హుకుంపేట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్నమహిళలు

హుకుంపేట నవంబర్ 6 ఆంధ్రజ్యోతి ; మండల కేంద్రంలో తాగు నీటి సమస్య పరిష్కరం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు టి. కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం మహిళలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో చాలా ఏళ్లుగా తాగునీటి సమస్యతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడున్నారన్నారు. గతంలో ఈ సమస్యపై పరిషత్ కార్యాలయం ఎదుట గతంలో నిరసన తెలిపినట్టు చెప్పారు. ప్రత్యేక ఆధికారి చంద్రశేఖర్ తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఇచ్చారని, ఆ హామీ నేటి వరకు అమలు కాలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కృష్ణమూర్తి, వార్డు సభ్యులు అన్నపూర్ణ ,రామణమ్మ లక్ష్మి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు: ఎంపీడీవో

ముంచంగిపుట్టు, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉపాధి హామీ పనులను కల్పించనున్నట్టు స్థానిక ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 100 రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హార్టికల్చర్ ద్వారా అందిస్తున్న మొక్కలు, పనుల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు, టీడీపీ నేత వంతాల జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

అనంతగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంగడ పంచాయతీ చీడివలస గ్రామ రహదారిని గిరిజనులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. ఈ గ్రామ మట్టిరోడ్డు మొంథా తుఫాన్‌కు కొట్టుకపోయి అధ్వానంగా మారింది. కనీసం వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గురువారం గ్రామస్థులు శ్రమదానంతో మట్టిరోడ్డును తాత్కాలికంగా బాగుచేశారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై పీవో ఆగ్రహం

సీలేరు, నవంబర్6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణిశ్రీపూజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సమస్యలను గుర్తించిన ఆమె ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. వృథాగా వదిలేసిన కంప్యూటర్‌లను గుర్తించారు. కంప్యూటర్లపై క్లాసులు ఎందుకు చెప్పడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల మెనూ అమలులో లోపాలు ఉన్నట్లు గుర్తించి ప్రిన్సిపాల్‌పై అసహనం వ్యక్తంచేశారు. ఇలాంటి లోపాలు ఇకపై జరగకూడదని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

పర్యాటకుల కోసం 'టెంట్ ఫర్ రెంట్‌లు'

- ప్రధాన రహదారి పక్కన పలుచోట్ల ఏర్పాటు
- అతిథులను ఆకట్టుకునేలా ముస్తాబు
- పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో యువత బిజీబిజీ



అరకులోయకు-పానిరంగిని రహదారి పక్కన ఏర్పాటు చేస్తున్న విడిది గృహం

అరకులోయ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో పర్యాటకుల కోసం వినూత్నరీతిలో స్థానిక యువత టెంట్‌ల ద్వారా వసతి సౌకర్యం కల్పనకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీజన్ ప్రారంభం కావడంతో సహజసిద్ధ అందాలు, మరోవైపు వలిసిపూల సోయగాలు, మంచుఅందాల మధ్య అరకులోయ, పరిసర ప్రాంతాలు ఆకట్టుకుంటున్నాయి. వీటిని చూసేందుకు వివిధ ప్రాంతాలను పర్యాటకులు వస్తుంటారు. వీరి విడిదికి వీలుగా టెంట్ ఫర్ రెంట్‌ల పేరిట ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన అర, పావుఎకరాల ఖాళీ స్థలాలను ఎంపిక చేసుకుని చుట్టూ కంచె ఏర్పాటుతోపాటు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రంగురంగుల లైటింగ్, ఉయ్యాలలు, మరి కొందరు సృజనాత్మకంగా పలు ఆకృతులతో టెంట్స్‌ను సిద్ధం చేస్తున్నారు. టాయ్‌లెట్స్ అందుబాటులో ఉంచుతున్నారు. సుంకరమెట్ట నుంచి చింతపల్లి వరకు ఈ టెంట్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అరకులోయలో ప్రధాన రహదారి ఆనుకుని వందలాది టెంట్‌లు మరో వారం రోజుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు నిర్వాహకులు జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.

వసతుల బట్టే అద్దెలు

టెంట్ సౌకర్యాలు, వచ్చే పర్యాటకుల సంఖ్య ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. ఇద్దరు ఉంటే టెంట్‌లో ఫుడ్ ఇన్స్టా,క్యాంప్‌ఫైర్‌తో రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వసూలు చేయనున్నారు. టెంట్‌లో సౌకర్యాలు, భోజనం, క్యాంప్‌ఫైర్ , ధింసా అదనపు సౌకర్యాలు కావాలంటే రేట్లు మారుతున్నాయి. ఈ టెంట్‌లలో చలికాలంలో కుటుంబాలతో ఉండేందుకు చాలా మంది మొగ్గుచూపుతున్నారు. ఇక యువతీ,యువకులు వీటిలో బసచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కడికక్కడ టెంట్‌ల ఏర్పాటుతో రిసార్టులు, లాడ్జీల వ్యాపారం తగ్గుముఖం పడుతుందన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికే వ్యాపారం అనుకున్నంత స్థాయిలో జరగడంలేదని రిసార్టులు, లాడ్జీల యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కార్తీక మాసం, పర్యాటకుల సీజన్ ప్రారంభం కావడంతో టెంట్ ఫర్ రెంట్ పేరిట పర్యాటకులకు స్వాగతిస్తున్నాయి. అ టెంట్లు ఏర్పాటుచేసుకునే వారికి జిల్లా యంత్రాంగం, పోలీసుశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పర్యాటకశాఖ, రెవెన్యూ, పంచాయితీ రాజ్‌శాఖ, పోలీసులు పరిశీలించాల్సి ఉంది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

పాడేరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ సూచించారు. జన జాతీయ గౌరవ దివాస్ భగవాన్ బిర్సాముండ 150వ జయంతి సందర్భంగా పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో పాడేరులోని తలారిసింగ్ పాఠశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రాజెక్టు స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సాధనతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు వన్నెతేవాలన్నారు. ప్రతీ విద్యార్థి పోటీల్లో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, విలువిద్య, జావెలిన్‌త్రో పోటీల్లో నాలుగు జోన్ల నుంచి 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్టు స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎస్.సింహాచలం తెలిపారు. గురువారం జరిగిన పోటీల్లో ప్రతిభను చూపిన 50 మంది విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం గీతం కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు శిక్షణ శిబిరంలో క్రీడలపై మరిన్ని మెలకవలు నేర్చుకొని అనంతరం పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రాజెక్టు స్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏటీడబ్ల్యూవో జి.అఖిల,అరకువేలి ఏటీడబ్ల్యూవో కె.వెంకటరమణ, ఎ.నాగ శిరీష, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికులు సమ్మె



ఏపీఎఫ్‌డీసీ డీఎం కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్న కాఫీ కార్మికులు

పాడేరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలోని కాఫీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విధులను బహిష్కరించి గురువారం ఏపీఎఫ్‌డీసీ డీఎం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం హెల్పర్స్ అండ్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు లింగేరి సుందరరావు మాట్లాడుతూ.. 2024 నవంబరులో జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు పదవీ విరమణ అయిన తరువాత వారి స్థానంలో కొత్తవారిని భర్తీ చేయడం లేదన్నారు. దీంతో ఉన్న కార్మికులపై పనివత్తిడి పెరిగిపోతుందన్నారు. సమ్మెలో కాఫీ కార్మికులు కాంతమ్మ, సుందర్ కుమార్, రామారావు, వసంత, కన్నాద్, వరలక్ష్మి, దేవి, చిన్నలమ్మ, ఎర్రమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

చింతపల్లి: కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. గురువారం ఏపీఎఫ్‌డీసీ కాఫీ కార్మికులు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి. సత్యనారాయణ, కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్ర రాజు, మాజీ అధ్యక్షులు ఎన్. కనకవల్లి, నాయకులు మోరీ వెంకటగిరి, రాజారావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

'గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతం'



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతం అవుతోందని జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య అన్నారు. గురువారం మండలంలోని కప్పలబెన్నవరం గ్రామంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్ ఆధ్వర్యంలో 20 మంది వైసీపీ కార్యకర్తలతోపాటూ 450మంది మద్దతుదారులు జనసేనలో చేరారు. వీరికి కండువాలతో గంగులయ్య స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంత అభివృద్ధికి చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు ఆకర్షితులైన ఆదివాసీలు జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అత్యధిక స్థానాలు సొంతం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్, సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్, ఏఎంసీ డైరెక్టర్ కృష్ణమూర్తి, జీకేవీధి మండలాధ్యక్షుడు కొయ్యం బాలు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు



మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

అనంతగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీడబ్ల్యూవో కార్యాలయం వద్ద ఆశ్రమ పాఠశాల వార్డెన్ల, మెట్రిన్‌లతో ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెనూను పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. విద్యార్థులు అనారోగ్యం గురైన వెంటనే ఆస్పత్రికి తరలించాలన్నారు. అనుమతిలేనిదే ఇతరులు లోపలకు ప్రవేశించకుండా చూడాలన్నారు.

డీఎంహెచ్‌వో దృష్టికి ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు



డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతినిధులు

పాడేరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్‌ను ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లేట్ టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వీటి పరిష్కారంపై డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ ఎంవీఆర్ ప్రభాకర్, జి.చిట్టిబాబు, కె.రామకృష్ణ, నాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా చేయాలి

సీలేరు, నవంబర్ (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ మండలకేంద్రం ఏర్పాటుకు గురువారం విరాళాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు మండల సాధన కమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తి తెలిపారు. సీలేరు, ధారకొండ, దుప్పిలివాడ గుమ్మిరేవుల అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు విరివిగా విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. అలాగే, దారకొండ కాలనీ వాసులు రూ. 3, 300 అందజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దుప్పిలివాడ మా జీ సర్పంచ్ అల్లంకి రాజు, సొన్ను, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో తేడా ఉంటే చర్యలు: తహశీల్దార్



డీఆర్‌డిపోను పరిశీలిస్తున్న తహశీల్దార్ త్రివేణి

డుంబ్రిగుడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు అందించే రేషన్ సరుకుల తూకంలో తేడాలుంటే సహించేదిలేదని స్థానిక తహశీల్దార్ త్రివేణి హెచ్చరించారు. గురువారం మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంల కొర్రా, గొందివలస డీఆర్ డిపోలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సరుకుల పంపిణీలో, తాకాల్లో తేడాలు వస్తున్నట్టు లబ్ధిదారులనుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించాలని డీఆర్ డిపోల నిర్వహకులకు సూచించారు. ప్రతి నెలా 15వ తారీఖులోగా సరుకులు ప్రతి లబ్ధిదారుడికీ అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు విజయ, మండల నాయకులు చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది కోటేశ్వరరావు, మహదేవ్ పాల్గొన్నారు.

జీసీసీ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ

- ఆదివాసీ రైతులు పండించిన కాఫీకి మార్కెటింగ్ సదుపాయం
- జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించినట్టు జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు అన్నారు. గురువారం జీసీసీ కార్యాలయంలో స్థానిక డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అధ్యక్షతన మూడు మండలాల బ్రాంచి ఉద్యోగుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నిర్మూలించి, ఆదివాసీ రైతుల వ్యవసాయ, అటవీ ఉత్పత్తులకు గరిష్ఠ ధరలు అందించేందుకు జీసీసీని ఏర్పాటు చేశారన్నారు. అయితే, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో జీసీసీ నష్టాల బాటపట్టిందన్నారు. సంస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీసీసీకి జవసత్వాలు అందిస్తున్నట్టు వివరించారు. జీసీసీ ఉత్పత్తులకు ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. ఆదివాసీల వ్యవసాయ, అటవీ ఉత్పత్తులతోపాటూ కాఫీకి జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. గిరిజన రైతులు పండించిన కాఫీకి ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ చొరవతో అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చారన్నారు. గిరిజన ప్రాంతంలో మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగుకి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. అలాగే ఈఏడాది కాఫీకి జీసీసీ గరిష్ఠ ధర అందించనుందన్నారు. కాఫీ గింజలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. జీసీసీ గిరిజన ప్రాంతాల్లో ప్రతి మండల కేంద్రం, పర్యాటక ప్రాంతాల్లో అరకు కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్ స్టాండ్లలోనూ స్టాళ్ల ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. జీసీసీ ఉద్యోగుల సమస్యలను బోర్డు సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి బ్రాంచి మేనేజర్లు సరమండ విజయ్ కుమార్, చల్లంగి సుగునాథం, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జి శెట్టి చిన్నబ్బాయి, అకౌంటెంట్ రాజుబాబు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం



టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ నాయకులతో 7వ తేదీ శుక్రవారం పాడేరులో అత్యఅవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల దృష్ట్యా బూత్ కన్వీనర్‌లు, బూత్ లెవల్ ఏజెంట్ల కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాస గృహంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కమిటీ, పార్లమెంట్ సభ్యులు, 5 మండలాలకు చెందిన నాయకులు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, తదితరులు ఆమె కోరారు.

టెన్త్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు



గురుకుల పాఠశాలను పరిశీలించిన పరీక్షల సహాయకమిషనర్ శశికుమార్

పెదబయలు, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్ష లు పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల సహాయ కమిషనర్ శశికుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మండలంలోని స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1, జడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలలను పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌ల పర్యవేక్షణలో 144 సెక్షన్ మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం, ఫర్నీచర్ తదితర వసతులు కల్పించాలన్నారు. అనంతరం జడ్పీ పాఠశాలలో టీచ్ టూల్ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుష్పజోసెఫ్, హెచ్‌ఎంలు నారాయణ, చిన్నయ్య, శంకరరావు, రామారావు, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర



ధరలు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ ఊర్మిళ, డైరెక్టర్లు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ(ఏఎంసీ) చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో డైరెక్టర్లతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ధాన్యం, మొక్కజొన్న, మినుములు, పెసలు, కందులు, జొన్నలు, నువ్వులు, సజ్జలు, రాగులు, వేరుశనగలు, పొద్దుతిరుగుడు తదితర పంటలను మార్కెటింగ్‌శాఖ కొనుగోలు చేస్తుందన్నారు. ఈధరలను ప్రతి గ్రామ సచివాలయంలో ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జగన్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, డైరెక్టర్లు పెదిరెడ్ల బాతాఉడు, సేవా ఈశ్వరమ్మ, వరలక్ష్మి, చెన్నకేశవనాయుడు, ఖాసింపల్లి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



దీపారాధనలో భక్తులు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబరడ గ్రామంలో గురువారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. భక్తులు 1,008 ప్రమిదల తో ఆలయాన్ని అలంకరించారు. అర్చకుడు దొంగబంటి వెంకట రమణ ప్రత్యేక పూజలు జరిపించారు. నిర్వాహక కమిటీ అధ్యక్షులు సింహాచలం, ఉపాధ్యాయుడు వెంకట గిరి, మహిళలు పాల్గొన్నారు.

మంచు ముత్యాలు



గొడుగులా సాలెగూడు

ముంచంగిపుట్టు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాలె గూడులు మంచు బిందువులతో ముత్యాల్లా మెరిసిపోతున్నాయి. గత మూడు రోజులుగా మండలంలో దట్టంగా మంచు కమ్ముకుంటుంది. దీంతో ఉదయం వేళల్లో సాలెగూడులపై పడిన మంచు బిందువులు ముత్యాల హారంలా కనిపిస్తున్నాయి. గురువారం ఉదయం మినుములపుట్టుకు వెళ్లే మార్గంలో ఆకర్షణీయంగా కనిపించాయి. వీటిని ఆంధ్ర జ్యోతి కెమెరాలో బంధించింది.



మెరుస్తున్న మంచు బిందువులు



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. క్యాంప్ కార్యాలయంలో 11 మందికి రూ.5,47,527 చెక్కులను గురువారం అందించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భగా స్పీకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఎన్.వెంకటరమణ, ఆర్పై పాత్రుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఆధ్వర్యంలో జీఎస్‌టీ-2.0 వల్ల దేశ ఆర్థిక వ్యవస్థను ఏ విధంగా మెరుగు పరుస్తుంది అన్న అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం క్రీడా, రాజకీయ అంశాలు, వర్తమాన అంశాలపై క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు.

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

రోలుగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి బీజేపీ నాయకులు సన్నద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం రోలుగుంటలో మండల బీజేపీ పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమిలో భాగంగా బీజేపీకి సముచిత స్థానం కల్పిస్తారన్నారు. పోటీకి పార్టీ నేతలు సన్నద్ధంగా ఉండాలని కోరారు. పార్టీ బలోపేతం బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. అన్ని పంచాయతీల్లో నియమించిన శక్తి కేంద్రాల ప్రముఖులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రి తమ్మునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మామిడి రమణ పాల్గొన్నారు.

షర్మిల దృష్టికి మాడుగుల సమస్యలు



పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు సంతకాల సేకరణ జాబితాను అందిస్తున్న కొండలరావు

మాడుగుల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మండలాల అభివృద్ధిపై దృష్టిసారించాలని నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కోరారు. ఓటుచోరీపై నియోజకవర్గంలో సేకరించిన సుమారు 12వేల ప్రజాభిప్రాయ సంతకాలు జాబితాలను విజయవాడలో షర్మిలను కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన షర్మిలతో మాట్లాడి నియోజకవర్గంలోని రోడ్లు, ప్రజా సమస్యల గురించి వివరించినట్టు కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుభాన్. సీనియర్ నాయకుడు బాను పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు సిద్ధం


▸▸ పౌరసరఫరాల శాఖ మేనేజర్ పి.జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ జయంతి

కె.కోటపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆ శాఖ మేనేజర్ పి. జయంతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గంలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, టెక్నికల్ సహాయకులు ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీలతో అవగాహన, శిక్షణ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు ఒకటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. టెక్నికల్ సహాయకులు శాంపిల్స్ సేకరించి తేమ శాతాల్లో తేడా రాకుండా చూస్తారన్నారు.రైతు సేవా కేంద్రాలు, మిల్లర్ల వద్ద బ్లూటూత్‌తో పనిచేసే ఒకే బ్రాండ్‌కి చెందిన తేమ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని ధాన్యం విక్రయించుకోవచ్చునని అన్నారు. ధాన్యం మిల్లుకు చేరిన వెంటనే రైతులఖాతాల్లో సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ భుజంగరావు, కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల ఏవోలు సోమశేఖర్, కృష్ణవేణి, కాంతమ్మ, అనసూయ పాల్గొన్నారు.


బీఎన్ రహదారి అభివృద్ధిలో నిర్లక్ష్యం



నిరాహార దీక్షలో ఆమ్ ఆద్మీ నాయకులు

చోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీ ఎన్ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ డిమాండ్ చేశారు. బీ ఎన్ రోడ్డు దుస్థితిని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష గురువారం నాటికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ, బీఎన్ రోడ్డులో ప్రజలు ఎంతోకాలంగా ఇబ్బందులు పడుతున్నా, అధికార యంత్రాంగంలో స్పందన కొరవడిందన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు రోడ్డు పనులు అప్పగించడం వల్ల బీ ఎన్ రోడ్డు ఎప్పటికీ పూర్తికావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పూర్తి చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఈ శిబిరంలో ఆమ్ ఆద్మీ నియోజకవర్గ కన్వీనర్ వేగి మహలక్ష్మినాయుడు, అట్ట పోయి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కూరుకుపోయిన లారీ.. నిలిచిన ట్రాఫిక్



దాసరయ్యపాలెం వద్ద కూరుకుపోయిన జీడిపిక్కల లోడు లారీ

రావికమతం: మండలంలో ఆర్‌ఈసీ రోడ్డులో దాసరయ్యపాలెం వద్ద రహదారిపై గోతిలో జీడిపిక్కల లోడు లారీ గురువారం రాత్రి రోడ్డులో కూరుకుపోయింది. దీంతో గంటల సమయం ట్రాఫిక్‌కు అంతరాయంనెలకొంది. గత మంగళవారం బండరాళ్ల లారీ దిగిపోయిన సంగతి తెలిసిందే. ఈ రోడ్డులో అడుగడుగునా గోతులతో అధ్వానంగా మారింది. వర్షం నీరు గోతుల్లో చేరి చెరువులను తలపిస్తోంది. గురువారం నర్సింపల్లి నుంచి జీడిపిక్కల లోడుతో మేడివాడ జీడి పిక్కల ఫ్యాక్టరీకి వస్తుండగా దాసరయ్యపాలెం వినాయక గుడి వద్ద రోడ్డు మధ్యలో దిగిపోయింది. దీంతో క్రైన్ సాయంతో లారీని పైకి లాగారు. ఇకనైనా అధికారులు మేల్కొవాలని పలువురు కోరుతున్నారు.

వడ్డాది డైవర్షన్ రోడ్డులో రాకపోకలకు అవస్థలు



వరదకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు



నిబంధనలకు విరుద్ధంగా అధిక బరువుతో వెళ్తున్న కర్రల లారీ

బుచ్చెయ్యపేట నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది డైవర్షన్ రోడ్డు మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్నది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రస్తుతం భారీ వాహనాలకు కాకుండా తేలికపాటి వాహనాలకు అనుమతి ఇచ్చారు. అయితే, గురువారం అధిక లోడు కర్రలతో మాడుగుల నుంచి వస్తున్న లారీ వంతెనపైనుంచి ప్రయాణం సాగించింది. ఈ నేపథ్యంలో వడ్డాది ఊరువైపు బ్రిడ్జి ముందు భాగం దెబ్బతింది. ఫలితంగా ఆర్టీసీ బస్సులు నర్సీపట్నం నుంచి వడ్డాది గ్రామం వరకు వచ్చి తిరిగి వెళ్ళిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వంతెన మరమ్మతులు చేపట్టాలని, పాత వంతెన పై భారీ వాహనాలు నిషేధించాలని పలువురు కోరుతున్నారు.

బంగారుమెట్ట వద్ద గొయ్యితో తంటాలు

బుచ్చెయ్యపేట: మండలంలో బంగారు మెట్ట జంక్షన్ వద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. గురువారం సాయంత్రం వడ్డాది నుండి సరుకులలోడుతో రావికమతం వెళ్తున్న వ్యాన్ ఈ గోతులో కూరుకు పోయింది. స్థానికులు సాయంతో బయటకు తీశారు. అలాగే, స్కూటీపై వెళ్తున్న జంట ఆదే గోతిలో సాయంత్రం పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి.

జడ్పీహెచ్ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్వో ప్లాంట్ ఓపెన్ చేసి విద్యార్థినులకు తాగునీరు అందజేస్తున్న విజయ్

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తురకబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ గురువారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు శుద్ధ జలాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లలో అవవసర వీడియోలు చూడడానికి బదులుగా చదువు, క్రీడలలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆర్వో ప్లాంట్ చేర్పాటు చేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. అలాగే విద్యార్థినులు భోజనం చేయడానికి వీలుగా షెడ్ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వాటర్ ప్లాంట్ దాతలు దంగేటి సత్యనారాయణమూర్తి, వెంకటేశ్వర్లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అల్లు అప్పారావు, విద్యా కమిటీ చైర్మన్ బాడ స్వప్న, రోటరీ క్లబ్ ప్రతినిధులు జంపా నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన



చోద్యంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మూర్తి, అధికారులు

గొలుగొండ/కృష్ణాదేవిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లను అధికారుల బృందం గురువారం పరిశీలించారు. గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, సిహెచ్.నాగాపురం, కొంగశింగి తదితర గ్రామాల్లో మండల స్థాయి అధికారులతో కలిసి నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్.మూర్తి కూలిపోయిన ఇళ్లను విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మూర్తి మాట్లాడుతూ మండలంలో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ఇళ్లు ఏ స్థితిలో ఉన్నాయనేది పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అలాగే చోద్యంలో అంగన్‌వాడీ భవనం పరిశీలించి, కొత్త భవన నిర్మాణానికి నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదన చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 26 ఇళ్ల వివిధ రకాలుగా దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ చైన్లు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అప్పారావు, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు అడిగర్ల స్వామినాయుడు, దేవాడ శేషు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

కృష్ణాదేవిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జనసంచారం ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెడుతున్నామని ఎస్ఐ పి.రామారావు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. హెచ్‌సీలు రామారావు, శ్రీను, వరహాలబాబు పాల్గొన్నారు.

రాచపల్లి భూముల ఫిర్యాదులపై విచారణ



ఫిర్యాదులపై విచారణ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి రెవెన్యూలోని సర్వే నంబరు 737 భూములపై వచ్చిన ఫిర్యాదులపై తహసీల్దార్ రామారావు గురువారం విచారణ చేపట్టారు. ఈ భూముల్లో తప్పులు ఉన్నాయని 27 మంది రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, దీనిపై ఆర్‌డీవో వి.వి.రమణ కమిటీ వేశారని, ఇందులో భాగంగా గురువారం విచారణ చేస్తున్నామని ఈ సందర్భంగా తహశీల్దార్ తెలిపారు. అనంతరం ఎరకన్నపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో భూములను సర్వే చేశారు. విచారణ పూర్తిచేసిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అప్పారావు, మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి తాగునీటి పథకాలపై నివేదిక

▸▸ జడ్పీ సీఈవో నారాయణమూర్తి



గోవాడలో అధికారులకు తాగునీటి సమస్య వివరిస్తున్న స్థానికులు

చోడవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకంద్వారా చేపట్టిన పనులను జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం సాయంత్రం పరిశీలించింది. మండలంలోని గోవాడ, అంబేరుపురం గ్రామాల్లో పర్యటించి అసంపూర్తిగా ఉన్న తాగునీటి నీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోవాడ పంచాయతీలో తాగునీటికిపడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు ఏడువాక సత్యారావు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, అసంపూర్తిగా నిలిచిన పనులపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నామని, ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత వీటిని పూర్తి చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఈ. సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, జె, అనిల్‌కుమార్, డీఈ అల్లు సూర్యనారాయణ, ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వన భోజనాలు



వివిధ పోటీల్లో విజేతకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ సువర్ణరాజు

దేవరాపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వాకపల్లిలో ఎం పీడీఓ కార్యాలయ అధికారులు సిబ్బందితో గురువారం వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి ఎంపీడీఓ సువర్ణరాజు బహుమతులు అంద జేశారు. నిత్యం విధినిర్వాహణలో బిజీ ఉండే అధికారులు, సిబ్బందికి మానసిక ప్రశాంతత కోసం వన భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఏవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయాల శాఖ రాష్ట్ర సంచాలకులు కృష్ణమోహన్



గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కృష్ణమోహన్

నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ రాష్ట్ర సంచాలకులు ఎ.కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఉప సంచాలకులు షేక్ పీర్ అహ్మద్, జిల్లా గ్రంథాయ కార్యదర్శి బి.కుమారరాజుతో కలిసి నర్సీపట్నం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇక్కడ పుస్తకాలు చదివి పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న యువతీ యువకులతో మాట్లాడారు. పోటీ పరీక్షల పుస్తకాలు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు దమయంతి, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ పొడి తయారీ కేంద్రం స్థల పరిశీలన

మాకవరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శెట్టిపాలెంలో కాఫీ పొడి తయారీ కేంద్రం స్థలాన్ని విజయవాడకు చెందిన బృందం గురువారం పరిశీలించారు. కేంద్రానికి ఎంత భూమి తీసుకున్నారు, రోడ్డు మార్గం వంటి విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. అలాగే గిరిజన శాఖ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బృందం సభ్యులు శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, సర్పంచ్ రామునాయుడు పాల్గొన్నారు.

తామరబ్బ టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం ప్రతినిధులు

దేవరాపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ గిరిజన పంచాయతీలో టీడీపీ గ్రామ శాఖకు ఎన్నిక బుధవారం జరిగింది. గ్రామ అధ్యక్షుడిగా జడ్డేటి.రమణమూర్తి, ఉపాధ్యక్షుడిగా మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మొసలి దేముళ్లతోపాటు మరో 11 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కు.ఈశ్వరరావు పాల్గొన్నారు.

డిసెంబరు 7న జ్యోతిర్మయి బాబా శతజయంతి



వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గేదల సత్యనారాయణ, తదితరులు

బుచ్చెయ్యపేట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమ్మల్లపూడి శివారు అమరపురిలో విశ్వశాంతి జ్యోతిర్మయి బాబా శత జయంతి ఉత్సవాలను డిసెంబర్ 4వతేదీన నిర్వహించనున్నట్టు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ రూ. 20 లక్షల ఎంపీ గ్రాంట్ మంజూరు చేశారన్నారు. ఈనిధులతో ఆశ్రమంలో వంట శాల నిర్మిస్తామన్నారు. మార్గశిర పౌర్ణమి సందర్భంగా బాబా జయంతి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ చైర్మన్ కృష్ణయ్యచౌదరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా శుక్రవారం నిలుపు చేయనున్నట్టు ఏఈఈ కర్రి.శంకరరావు తెలిపారు. అలమండ, ములకలాపల్లి, కొత్తపెంట, ఎన్ గజపతినగరం గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు చైత్ర దీపిక ఎంపిక



నర్సీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం శివాజీ పార్కు స్కేటింగ్ రింగ్‌లో జరిగిన 37వ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో నర్సీపట్నం ప్రాంతానికి చైత్ర దీపిక ప్రతిభ కనబరిచింది. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు అండర్-18 గ్రూప్ ఈవెంట్స్ విభాగాలలో వరుస విజయాలు సాధించింది. ఈ మేరకు 63వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించింది.

ఘనంగా బిర్సా ముండా జయంతి

చీడికాడ నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ గిరిజన నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు మండలంలో కోనాం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 7న జిల్లా స్థాయి పోటీలకు హజరవుతారని హెచ్‌ఎం రమణమూర్తి తెలిపారు. హస్టల్ వార్డెన్ వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు మార్గంలోకి వెళ్లొద్దు

నాతవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువకులు చెడు మార్గంలోకి వెళ్లకూడదని ఎస్ఐ తారకేశ్వరరావు సూచించారు. దూమపానం, మద్యపానం చేస్తున్న కొంతమంది యువకులను గుర్తించి డాక్టర్ ప్రసన్న కుమార్‌తో గురువారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు. అలాగే ఉద్యోగాలు పొందిన యువకులకు హెల్మెట్ కూడా పోలీసులు అందించామన్నారు. త్వరలో వాలీబాల్ కిట్లు ఇస్తామని ఆయన చెప్పారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ

మాకవరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వజ్రగడ పాఠశాలలో విద్యార్థులకు గురువారం జామ మొక్కలను పంపిణీ చేశారు. జీవన వృక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రమణ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయలకు మొక్కలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి సూరిబాబు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

బి.కింతాడలో తుప్పల తొలగింపు



శ్రమదానంతో తుప్పలు తొలగిస్తున్న గ్రామస్థులు

దేవరాపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడలో దుర్గాదేవీ ఆలయం నుంచి సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తెలుగు రైతు నియోజవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ కడింనాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం శ్రమదానం చేసి తొలగించారు. కార్తీక మాసం సందర్భంగా గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందిలేకుండా చేశారు. గల్లా అప్పారావు , గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కోసం ఆందోళన



గొల్లపేటలో రక్షిత పథకం ట్యాంకుపైన నిరసన తెలుపుతున్న మహిళలు

రోలుగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా కనీసం అధికారులు స్పందించడంలేదని ఆరోపిస్తూ గురువారం గొల్లపేటలో మహిళలు వాటర్ ట్యాంక్ పైకి వెళ్లి బిందెలతో ఆందోళన చేపట్టారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ22 లక్షలు ఖర్చు చేసి ట్యాంకు, బోరు, ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసినా గత ఏడాదిగా తాగునీటి సరఫరా చేయలేదని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సురక్షిత నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, గ్రామస్థులు సత్యవతి, మెలిం అచ్చియ్యమ్మ, చందక రాజుబాబు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై నిఘా: డీఎస్పీ



ఎస్ఐతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

చీడికాడ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) గంజాయి అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అనకాపల్లి డీఎస్పీ ఎం శ్రావణి పోలీసులను ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ని గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ, స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మహిళా పోలీసులతో మాట్లాడి బాలికల రక్షణకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. శక్తి యాప్ అధికంగా డౌన్ లోడ్ చేయించాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమెతో పాటు కె కోటపాడు సీఐ పి. పైడియ్యనాయుడు, పోలీసులు పాల్గొన్నారు.

వ్యాస రచనలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దేవరాపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి సిరగం శ్రావణ్‌కుమార్ వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బి.రాధ విద్యార్థిని అభినందించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన పోటీల్లో పాల్గొని విజయం సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

జైళ్ల శాఖ డీఐజీ సబ్ జైలు సందర్శన



ఎలమంచిలి సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సబ్‌జైలును గురువారం జైళ్ల శాఖ డీఐజీ ఎం.ఆర్.రవి కిరణ్ సందర్శించారు. ద్వి వార్షిక తనిఖీల్లో భాగంగా జైలును సందర్శించి పరిసరాలను పరిశీలించారు. జైలు రికార్డులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్ జైలు జిల్లా అధికారి జి.వెంకటరమణ, స్థానిక జైలు అధికారులు డి.రాజు, ఎం.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

బాలికల ఆరోగ్యంపై డీఎంహెచ్‌వో ఆరా

» ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



కందమామిడి ఆశ్రమ పాఠశాలలో బాలికలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్

పాడేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాల, అం గన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ గురువారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో బాలికలు, టీచర్లతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధకనబరచాలని ఆయన సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలలను పరిశీలించి, అందుతున్న సేవలపై కార్యకర్తలను అడిగ తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన బాట

» సమస్యల పరిష్కారం కోసం 8, 9 తేదీల్లో అనకాపల్లిలో మహాసభ

» ఉమ్మడి జిల్లాలో 5,200 మంది కార్యకర్తలు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాప్‌ల పేరుతో పెంచిన పని ఒత్తిడిని తగ్గించడంతోపాటు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే ఉద్దేశంతో ఈ నెల 8, 9 తేదీల్లో అనకాపల్లిలో మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇవీ డిమాండ్లు..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐదు వేల మందికిపైగా ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. విశాఖ జిల్లాలో 900 మంది, అనకాపల్లి జిల్లాలో 1500 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,800 మంది పనిచేస్తున్నారు. ఆశ కార్యకర్తలకు గతంలో ఆరు వేల రూపాయలు వేతనంగా చెల్లించేవారు. 2019లో రూ.10 వేలకు పెంచారు. గడిచిన ఎన్నికల సమయంలో కనీస వేతనం చెల్లిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. గతంతో పోలిస్తే పని మూడు రెట్లకుపైగా పెరిగిందని, ఎన్‌సీడీ సర్వే, ఫీవర్ సర్వే, అభా కార్డులు అంటూ ఇంటింటికీ తిరగాల్సి వస్తోందంటున్నారు. ఆ డేటాను మళ్లీ ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందన్నారు. ఆన్‌లైన్ వర్క్ భారాన్ని తగ్గించడంతోపాటు వేగంగా పని పూర్తి చేసేందుకు అనుగుణంగా నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అంధకారంలో పెద్దాస్పత్రి!

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో ఓ వార్డు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేజీహెచ్‌లో గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు అలముకున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భావనగర్ వార్డు, రాజేంద్రప్రసాద్ వార్డు, పిల్లల వార్డు, గైనిక్ వార్డు, సీఎస్ఆర్ బిల్డింగ్‌లోని కొన్ని విభాగాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆస్పత్రి మార్చురీలో అండర్ గ్రౌండ్ పనులు నిర్వహిస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో ప్రధాన వార్డులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఆక్సిజన్, ఐసీయూ, వెంటిలేటర్ సేవలందించే అత్యవసర విభాగాలు ఉన్న సీఎస్ఆర్ బిల్డింగ్, భావనగర్ వార్డులోని అక్యూట్ మెడికల్ విభాగానికి జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. మిగిలిన వార్డులలోని రోగులు తీవ్ర ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. విద్యుత్ లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా మరుగుదొడ్లు వినియోగించేవారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆ పరిసరాలన్నీ అస్తవ్యస్తంగా మారిపోయాయి. రాత్రి 9 గంటలు దాటినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో రోగులు చిమ్మచీకట్లో అవస్థలు పడుతున్నారు. వార్డుల్లో మీద బెడ్ మీద ఉండాల్సిన రోగులు ఆరుబయటకు వచ్చి వరండాల్లో తిరుగాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రి చరిత్రలో ఇన్ని గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దాఖలాలు లేవు. అంతేకాకుండా సమస్యను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఆస్పత్రి పరిపాలనాధికారి గురువారం కేజీహెచ్‌లో లేరు. అత్యవసర చికిత్స విభాగాలకు జనరేటర్‌పై అధిక సమయం విద్యుత్ సరఫరా చేయడం కూడా కష్టమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వార్డుల్లోని రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలియడం లేదు.



మొబైల్ ఫోన్ టార్చ్‌లైట్ల వెలుగులో విధులు నిర్వహిస్తున్న నర్సులు

తగ్గని వరహా నది ఉధృతి

» పది రోజులుగా పందూరుకు రాకపోకలు బంద్



పందూరు వద్ద వరహా నది ఉధృతి

కోటవురట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరహా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పందూరు గ్రామానికి పది రోజుల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గత నెల 27న తుఫాన్ ప్రభావం వలన కురిసిన భారీ వర్షాలకు వరహా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ఏడాది వరహానదిలో గొట్టివాడ పందూరు గ్రామస్థుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరిగాయి. దీంతో నది లోతు బాగా పెరిగిపోయింది. ప్రస్తుతం నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించడానికి పందూరు గ్రామస్థులు వెనుకంజ వేస్తున్నారు. పందూరు పంచాయతీతో పాటు శివారు బంధ, ములగలలోవ గ్రామాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

రాష్ట్రంలో 244 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి కృషి

నియామకాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేత

» గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు చదివిన ఎందరికో ఉద్యోగాలు

» విశాఖపట్నంలో రూ.34 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు

» గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్



శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న కృష్ణమోహన్

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 244 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి ప్రభుత్వానికి నివేదిక పంపామని గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ సిబ్బంది వివరాలను, పుస్తకాల వివరాలను గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలను చదవడం వలన రాష్ట్ర వ్యాప్తంగా 350 మంది పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారన్నారు. అలాగే డీఎస్సీకి 360 మంది ఎంపికై ఉపాధ్యాయులుగా నియమితులయ్యారని చెప్పారు. అమరావతిలో త్వరలోనే రాష్ట్ర స్థాయి కేంద్ర గ్రంథాలయం అందుబాటులోకి రానున్నదన్నారు. పది లక్షల పుస్తకాలు ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. విశాఖపట్నంలోని మహారాణిపేటలో రూ.34 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే అంచనాలను పరిశీలించి ప్రభుత్వ అనుమతికి నివేదిక పంపామన్నారు. ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు గ్రంథాలయాలను దగ్గర చేయడమే లక్ష్యమన్నారు. అన్ని జిల్లాల్లో జిల్లా గ్రంథాలయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని, అనకాపల్లి జిల్లా కేంద్రంగా గ్రంథాలయ సంస్థ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అద్దె భవనంలో నడుస్తున్న శాఖా గ్రంథాలయాన్ని కొత్తూరు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న డిజిటల్ లైబ్రేరిలోకి మారుస్తామని చెప్పారు. ఆయన వెంట గ్రంథాలయశాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆనందరావు, తదితరులు ఉన్నారు.

విద్యాలయాల్లో సమస్యలపై గళం

... 3వ పేజీ తరువాయి

చెప్పారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలల భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నర్సీపట్నం మండలం వేములపూడి బాలికల వసతిగృహ భవనం వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నదని, తక్షణమే మరమ్మతులు చేయించాలని జడ్పీటీసీ సభ్యురాలు ఎస్.రమణమ్మ కోరారు.

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.861 కాగా గ్రామీణ ప్రాంతంలో సిలిండర్ డెలివరీ బాయ్స్ రూ.920 వసూలు చేస్తున్నారని కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి నందకిశోర్ స్పందిస్తూ, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతగిరి సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ, ఈ-కేవైసీ చేయకపోవడంతో చాలామందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందడంలేదని అన్నారు. అల్లూరి జిల్లా పౌరసరఫరాల శాఖ ప్రతినిధి బదులిస్తూ.. గ్యాస్ గోదాములు, గ్యాస్ డీలర్ల వద్ద ఈ-కేవైసీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ బాధ్యతల నుంచి జీసీసీని తప్పించారా? అని ప్రశ్నించారు. సంబంధిత ప్రతినిధి బదులిస్తూ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్నామన్నారు. దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ, పాడిపశువుల కొనుగోలుకు డీఆర్‌డీఏ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వడంలేదని అన్నారు. గొలుగొండ మండలం వెంకటరాంపురంలో సదరం సర్టిఫికెట్ల ప్రకారం సంక్షేమ పింఛన్లు తీసుకుంటున్న వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చి మానసికంగా వేధిస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు ఆరోపించారు. డీఆర్‌డీఏ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. హౌసింగ్‌పై అనంతగిరి సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ, చిలకలగెడ్డలో పేదలకు గతంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, కానీ ఇళ్ల నిర్మాణాలకు ఇంతవరకు అనుమతులు ఇవ్వలేదని అన్నారు. పలు పీహెచ్‌సీల అంబులెన్స్‌లకు డ్రైవర్ల కొరత ఉందని కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యుడు అనురాధ అన్నారు. తొలుత కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు మరణం పట్ల సమావేశంలో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సమావేశంలో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల్లో అక్రమాలు

... 3వ పేజీ తరువాయి

నేరుగా వ్యాన్లలోకి బియ్యం బస్తాలను లోడింగ్ చేసి, తరువాత వే బ్రిడ్జిలలో ఎలక్ట్రానిక్ కాటాపై తూకం వేయాలి. కానీ ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది ఈ నిబంధనలను పాటించడం లేదు. జిల్లా గోదాము నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చిన బియ్యాన్ని నేరుగా వేరే లారీల్లో లోడింగ్‌చేసి, తూకం వేయకుండానే డిపోలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి బస్తాలో నికరంగా 50 కిలోల బియం వుండాలి. గోనె సంచితో కలిపి 50.58 కిలోలుగా పరిగణిస్తారు. కానీ ఆ మేరకు బియ్యం వుండడం లేదని, టన్నుకు 15-20 కిలోల తరుగు వస్తున్నదని రేషన్ డీలర్లు చెబుతున్నారు. తూకం వేసి ఇవ్వాల్సిందేనని తాము పట్టుబడితే.. తరువాత కాలంలో రేషన్ డిపోల్లో తనిఖీల పేరుతో వేధిస్తారని, 6ఏ కేసులు నమోదు చేయిస్తారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెద్ద లారీలో నుంచి వ్యాన్‌లోకి బియ్యం బస్తాలను మారుస్తున్న కలాసీలు

రేషన్ బియ్యాన్ని తూకం వేయకుండా డిపోలకు సరఫరా చేయడంపై స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము ఇన్‌చార్జిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. డీలర్లు ఇష్టపడే తూకం వేయకుండా బియ్యం తీసుకెళుతున్నారని అన్నారు. తూకం వేయాలని వాళ్లు (డీలర్లు) అడిగితే తప్పకుండా కాటా వేయిస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని తహశీల్దారు అంబేడ్కర్ వద్ద ప్రస్తావించగా, తూకం వేయకుండా రేషన్ డిపోలకు బియ్యం సరఫరా చేస్తున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. నిబంధనల ప్రకారం డీలర్ సమక్షంలో తూకం వేసి సరుకులు ఇవ్వాలని, ఈ విషయంపై దృష్టి సారిస్తానని ఆయన చెప్పారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎలమంచిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని కొక్కిరాపల్లి వై.జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన అడబాల సాయిరాం(58), తన అల్లుడు దాసరి గోవింద్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఎలమంచిలి మీదుగా అనకాపల్లి వైపు వెళుతున్నాడు. ఎలమంచిలి వై.జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా తుని నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో సాయిరాం కిందపడిపోగా, అతనిపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గోవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు సాయిరాంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదం విషయం తెలిసి ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేశారు. సాయిరాం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎలమంచిలి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు తులాల బంగారం చోరీ

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గవరపాలెం దాడివారి వీధిలోని ఒక ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగిందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. దాడివారి వీధిలో నివాసముంటున్న కొణతాల నాగమణి అనే వృద్ధురాలు గాలి కోసం ఇంటి తలుపులు వేయకుండా ఐరన్ గ్రిల్‌కు గడియ పెట్టి నిద్రపోయింది. మిగిలిన కుటుంబ సభ్యులు కూడా లోపల నిద్రించారు. దొంగలు ఇనుప గ్రిల్ గడియ తప్పించి లోపలికి ప్రవేశించి రెండు తులాల బంగారం నల్లపూసల దండ, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి ఆమె కుమారుడు సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, ట్రైనీ ఎస్‌ఐ పి.గౌరి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ విభాగం సిబ్బంది ఆధారాలు సేకరించారు.

48 కిలోల గంజాయి పట్టివేత

» ఒకరి అరెస్టు, మరొకరు పరారీ

» సరికొత్త రీతిలో గంజాయి రవాణా

» కారు వెనుక బంపర్‌లో ప్యాకెట్లు





స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడితో సీఐ స్వామినాయుడు, పోలీసులు. (ఇన్‌సెట్‌లో) కారు వెనుక బంపర్‌లో రవాణా చేస్తున్న గంజాయి ప్యాకెట్లు

కశింకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాదారులు పోలీసులకు పట్టుబడకుండా వుండేందుకు రోజుకో కొత్త రీతిలో సరుకు తరలిస్తున్నారు. కారు వెనుక వైపు బంపర్‌లో గంజాయి ప్యాకెట్లు పెట్టి రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అనకాపల్లి జిల్లా కశింకోట మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు అనకాపల్లి ఈగల్ టీమ్‌కు వాహనం నంబరుతో సహా సమాచారం వచ్చింది. దీంతో కశింకోట పోలీసులను అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ లక్ష్మణరావు, పోలీసులు సిబ్బందితో కలిసి గురువారం ఉదయం నర్సీపట్నం- తాళ్లపాలెం రోడ్డులో అచ్చెర్ల కూడలి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నర్సీపట్నం వైపు నుంచి వస్తున్న ఒక కారును ఆపగా, వెంటనే ఓ వ్యక్తి కారులో నుంచి దిగి పరారయ్యాడు. తరువాత పోలీసులు కారు లోపల, డిక్కీలో తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించలేదు. దీంతో అనుమానం వచ్చి కారును క్షుణ్ణంగా పరిశీలించారు. వెనుకవైపు బంపర్ తేడాగా కనిపించడంతో దానిని ఓపెన్ చేయగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కారులో వున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఇతను అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం దుచ్చెర్తి గ్రామానికి చెందిన అక్కపల్లి సుధాకర్‌గా నిర్ధారించారు. పరారైన వ్యక్తి గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ కొత్తూరుకు చెందిన సలాం రాజుపడాల్‌గా గుర్తించారు. గంజాయిని తూకం వేసి 48 కిలోలు వున్నట్టు లెక్కతేల్చారు. కారును సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

120 కిలోల గంజాయి స్వాధీనం. నలుగురి అరెస్టు

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్న 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని స్థానిక సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు చెందిన మహిళకు విక్రయించారన్నారు. ఆమె గొలుగొండ మండలం పసరాడ గ్రామానికి చెందిన మహిళ, ఆమె భర్త, మరో ఇద్దరు వ్యక్తుల సహకారంతో గంజాయిని తమిళనాడు తరలించేందుకు ఆటోలో సీలేరు, జీకేవీధి, చింతపల్లి మీదుగా తీసుకొని వెళుతోందన్నారు. గురువారం మధ్యాహ్నం అంతర్ల జంక్షన్ వద్ద ఎస్‌ఐ వెంకట రమణ, పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. జీకేవీధి నుంచి వచ్చిన ఆటో పోలీసుల వద్దకు రాగానే ఒక వ్యక్తి వాహనం దిగి పారిపోయాడన్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆటోను తనిఖీలు చేయగా 120 కిలోల గంజాయి బయట పడిందన్నారు. గంజాయి, ఆటోని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు.

భూమి విషయంలో బీజేపీ నాయకుడిపై దాడి

మాకవరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూమిని సర్వే చేయించేందుకు వెళ్లిన తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ బీజేపీ నాయకుడు అడిగర్ల రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి. రాచపల్లి రెవెన్యూ పరిధిలోని 737 సర్వే నంబరులో ఇటీవల సర్వే చేయగా తప్పులు దొర్లాయి. దీంతో మళ్లీ సర్వే చేయాలని కోరుతూ అడిగర్ల రాంబాబు ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. దీనిని పరిశీలించిన ఉన్నతాధికారులు.. గురువారం సర్వే చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దీంతో రాంబాబుకు గురువారం ఉదయం రెవెన్యూ సిబ్బంది ఫోన్ చేసి సదరు భూమి వద్దకు రావాలని కోరారు. రాంబాబుతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు అక్కడకి వెళ్లారు. కొద్దిసేపటి తరువాత రెవెన్యూ సిబ్బంది ఫోన్ చేసి, ఈ రోజు రావడం లేదని, శుక్రవారం వస్తామని చెప్పారు. దీంతో రాంబాబు, అతని అనుచరులు తిరిగి ఇంటికి బయలుదేరారు. దారిలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుతగిలి, నీకు భూమి ఎక్కడ వుంది? అంటూ దాడి చేశారు. పక్కన వున్న అనుచరులు అడ్డుకోవడంతో రాంబాబు వద్ద వున్న రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579